మనమీద కూడా మనం 'జోక్స్' వేసుకోగలిగిన పరిస్థితి వుంటేనే ప్రయోజనాత్మకమైన ఉత్తమ హాస్యం మనగలుగుతుందన్న నమ్మకంతో ఈ కథను ప్రచురిస్తున్నాము. అంతేతప్ప, రచయితలనూ, పత్రికలనూ, సంపాదకులనూ వేళాకోళంచేసి కించపరచాలన్నది మా ఉద్దేశం కాదని మనవి చేసుకుంటున్నాము.

—ఎడిటర్

ఒకరోజు ప్రొద్దున్నే తెలుగు పాఠకుల నెత్తిమీద మరో బండరాయి పడింది.

ఏ సాధారణమైన జ్యోతిష్యుడిని అడిగినా 'మేషం నుంచి మీనం దాకా అన్ని రాశుల వారి గ్రహాలూ విచ్చలవిడిగా తిరుగుతున్న టైమ్ అది' అని చెప్తాడు.

కుజుడు గురువు ఇంటికి వెళ్ళడం, కుజుడిని ఇంట్లో కూర్చోపెట్టి, తగుదనమ్మా అని గురుడుగారు బుధుడింట్లోకి దూరడం, అప్పటికే బుధుడుగారు దేశాలుపట్టి పోయారని తెలిసి తిరిగి ఇంటికొచ్చేసరికి గురుపత్నిని కుజుడు నీచదృష్టితో చూసి ఎకసెక్కాలు చేస్తుంటే చంద్రుడు ఉచ్ఛ స్థానంలో వుండి, కుజుడిని మందలించడం, ఇత్యాధి సంఘటనలు చకచకా జరిగిపోతున్న వేళ అది.

ఆ రోజు పొద్దున్నే సుబ్బారావులు, రామారావులు, అప్పలకొండలు, షేక్ సుల్తానా అజీజ్‌లు, కనకలక్ష్మలు, బెల్లంపల్లులు, జి. సూర్యరత్న మలక్‌పేట కాలనీలు అందరూ అమాయకంగా హుర్రే అని అరిచారు- ఆరోజు దినపత్రిక చూసి. అందులోని ప్రకటన-


"హమ్మయ్య! వచ్చేసింది తెలుగు పాఠకులారా! వచ్చేసింది. ఇంతకాలం సరైన వారపత్రిక లేక, తాళ పత్రాలు చదువుకుంటూ గడిపేసిన మీ సహనానికి ప్రతిఫలం ఇదుగో... పత్రిక పేరేమిటని ఆత్రుతపడుతున్నారు గదూ! హ...హ...హ... ఇది సస్పెన్స్. మార్కెట్లో వ్రేలాడుతోంది. వెళ్ళి కొనుక్కోండి. వెల మూడు రూపాయిలే..."

ఇదీ వార్త. పాఠకులు అయోమయంలో పడ్డారు. పత్రిక పేరు చెప్పకుండా ఎలా అడుగుతాం షాపు అతన్ని. అనుకుని సరేలే పేరు లేని పత్రిక ఏదుంటే అదే అనుకుని హడావుడిగా బజార్లంట పడ్డారు.

దూరం నుంచే కనిపిస్తోంది పత్రిక. పేరు లేదు. ముఖచిత్రం మాత్రం వుంది. వేలితో చూపించి మాటా పలుకూ లేకుండా మూడు రూపాయలిచ్చి పత్రిక కొనుక్కున్నారు పాఠకులు.

సాహిత్యాభిలాష బాగా వున్న ఒకానొక తెలుగు పాఠకుడు సుబ్బరాజు. అతను చేసేది పోస్ట్‌మాన్ ఉద్యోగం. అయినా అతన్ని అపార్థం చేసుకోకూడదు. 'పత్రికలను 'కొని చదివే' (అ)శేష పాఠకుల్లో అతను కూడా ఒకడు.

సుబ్బరాజు కూడా ఆ వారపత్రిక కొని ఇంటికొచ్చి పేజీలు తిరగేశాడు.



పత్రికల అత్తవారింట్లో నిత్య పెళ్ళికొడుకు! పాఠకులపాలిటి ఎవర్‌గ్రీన్ హీరో!!

# సీరియలుడి చిత్రవధ

ప్రసన్నకుమార్ సర్రాజు

విష(య) సూచికలో అన్నీ వున్నాయ్... ఫర్లేదు. ఆరు సీరియల్స్ వున్నాయ్. కానీ ఏ సీరియల్ రచయిత పేరు లేదు. మూడు సీరియల్స్‌కైతే సీరియల్ పేరు కూడా లేదు. ఒకదానికి పెద్ద క్వొశ్చెన్ మార్కు, రెండో దానికి ఆశ్చర్యార్థకం, మూడో సీరియల్‌కి ఊహ...! అన్న విట్టూర్పు మార్కు వున్నాయి!

ఏ సీరియల్ ఎవరు రాశారో పాఠకులే కనుక్కోవాలట. కనుక్కున్నాక ఆ సీరియల్ పేరు కూడా చెప్పాలట. ఈ రెండూ కనుక్కున్నాక ఆఖర్న సంపాదకుడి పేరు కూడా కనుక్కోవాలోచ్! అని రాశారు సంపాదకీయంలో.

సుబ్బరాజుకి ఒళ్ళుమండింది. 'మాకింకేం పనీపాటా లేవా?' అన్నాడు పెద్దగానే.

"లేవనే అనుకున్నాను. పొద్దున్నే లేవగానే ఆ పుస్తకం తెచ్చి పక్క మీద బోర్లా పడుకుని చదువుతుంటే" అంది సుబ్బరాజు భార్య. అప్పుడు టైమ్ చూసుకున్నాడు 8-30 అయింది. హడావుడిగా ఆఫీసుకి బయలుదేరాడు.

రెండో సంచికలో మూడవ పేజీలో 'కనుక్కోండి చూద్దాం' అన్న హెడ్డింగుతో పేజీ మొత్తం బార్డరు గీసి తెల్ల కాగితం వుంది. ఏం కనుక్కోవాలో ఎక్కడ కనుక్కోవాలో అర్థం కాలేదు సుబ్బరాజుకి. తరువాత సంచికలో ఒక కనుబొమ్మ వుంది. ఆ పేజీలో- ఆ తరువాత సంచికలో ఆ కనుబొమ్మ కింద ఒక కన్ను పడింది. ఇక తరువాత సంచికలో క్రమంగా రెండవ కనుబొమ్మ, దాని తాలూకు కన్ను, అప్పడం ముక్కు, ఒకటవ పెదిమె, రెండవ పెదిమె, ఆ రెండిటి మధ్యా ఇకిలించు కుంటూ మూడో నాలుగో పళ్ళు, ఒకటవ పెదిమెపైన ఈ సంచికలో అర మీసం, పై సంచికలో పూర్తి మీసం, చెవులు, క్రాపు- ఇవన్నీ పడి ఒక పూర్తి ఆకారం ఏర్పడ్డాక...

'నేనే'-ఇట్లు మీ సంపాదకుడు- అనిపడింది.

మొహం చూశారుగా! ఇహ పేరు కనుక్కోండి అని మళ్ళీ మొదటి కొచ్చింది. ఒక్కో సంచికలో ఒక్కో అక్షరం ఏదో మూల వుంటుందిట. అవన్నీ క్రోడీకరించుకుని సంపాదకుడి పూర్తి పేరు కనుక్కోవాలట. ఇది కాక ఓ రెండు నెల్లు పోయాక సంపాదకుడి పేరు తెలిసింది. 'వచ్చే వారమే! వచ్చే వారమే' అని వరసగా ప్రకటనలిచ్చి చివరికి -పత్రిక కొన్నవాళ్ళకు ఉచిత బహుమతుల పథకం ప్రారంభించారు.

మొదటి వారం పుస్తకాల షాపులో వ్రేలాడే పత్రికలకి చాక్‌లెట్లు అంటించారు. తరువాత వారం 'డ్రోగెజ్' కంపెనీ వారి సహకారంతో సబ్బు బిళ్ళలు వ్రేలాడుతూ కనిపించాయి పత్రికకి. ఇంకొన్నాళ్ళ తర్వాత వాటర్ కాన్‌లు, ఫ్లాస్కులు వ్రేలాడాయి. అప్పటికి పత్రిక ధర 'తప్పనిసరి' అయి పదిహేను రూపాయిలకు పెంచడం జరిగింది. ప్రియతమ పాఠకుల్ని సహృదయతతో సహకరించమని మనవి కూడా చేశారు.

ఇప్పటికే 'కొన్ని లక్షల మంది పాఠకులు చదువుతున్న పత్రికకి ఈ ఉచిత బహుమతుల స్కీమ్ ఎందుకో అర్థం కాలేదు సుబ్బరాజుకి.

కొన్నాళ్ళ తర్వాత తను రెగ్యులర్‌గా పత్రికలు కొనే షాపు వైపుకెళ్ళిన సుబ్బరాజుకి పత్రికలు కాదు సరికదా అసలా షాపే కనిపించలేదు. చత్వారం గానీ వచ్చిందా అనుకుని అపింటా వెడుతున్న ఇద్దరు కాలేజీ అమ్మాయిల్ని చూశాడు. ఎత్తు పల్లాలు కొలతలతో సహా స్పష్టంగా కనబడ్డాయి. ఏమిటి చెప్మా అని దుకాణం వుండే ప్రదేశానికి దగ్గరగా వెళ్ళాడు. అక్కడ ఓ డజను దాకా నిలువెత్తు బీరువాలు వున్నాయి. రెండు బీరువాల సందుల్లోంచి లోపలికి చూశాడు. దుకాణదారుడు లోపల చెమటలు కారుస్తూ కూర్చుని వున్నాడు.

సుబ్బరాజు టార్జాన్‌లాగా రెండు అరచేతులూ నోటికి చుట్టూ గొట్టంలా పెట్టి "దుకాణదారూ! దుకాణదారూ!" అని గట్టిగా పిలిచాడు.

లోపల్నుంచి హీనస్వరంతో "నేనే... ఏంకావాలి?" అని వినిపించింది. లోపల అలాగే సజీవ సమాధి అయిపోతాడేమో అనిపించి బలం అంతా ఉపయోగించి ఒక బీరువాని ఇవతలికి జరిపాడు సుబ్బరాజు.

రివ్వున గాలి వీచి దుకాణదారుడు గుండెల నిండా ఆక్సిజన్ పీల్చుకుని కృతజ్ఞతగా సుబ్బరాజుని చూశాడు.

"ఏమిటిది? పత్రికలమ్మేచోట బీరువాలమ్ముకుంటున్నావా!" అని జాలిపడ్డాడు సుబ్బరాజు.

"ఏం చెప్పమంటారు సార్, ఆ పత్రికల వాళ్ళు నా కొంప ముంచుతున్నారు. ఏజెన్సీ ఒప్పుకున్నాక తప్పుతుందా?" అని గొణిగాడు షాపతను.

"ఏ పత్రిక?" అడిగాడు సుబ్బరాజు.

"నా బొంద... పేరు ఇంకా సస్పెన్స్‌లోనే పెట్టి ఇప్పటికి సంవత్సరమైంది గదండీ! కనీసం పేరు పెట్టి తిట్టుకోడానికి కూడా వీల్లేదు. వాళ్ళు ఉచిత బహుమతి కింద ప్రతి పత్రికకీ ఈ బీరువాలు కట్టి-అదేలేండి... ప్రతీ బీరువాకీ పత్రిక కట్టి లారీల్లో వచ్చి పడేసి వెళ్ళారు. వీటిని చీల్చుకుని లోపలికి రాలేకపోతున్నారు కష్టమర్లు. పొద్దుట్నుంచి ఒక్క దినపత్రిక కూడా అమ్మలేదు" అన్నాడు ఏడుపు గొంతుతో.

"అరే! అలాగా! పత్రిక వెల ఎంత?" అడిగాడు సుబ్బరాజు.

"తొమ్మిదొందల ఎనభై ఏడు రూపాయిలు మాత్రమే"

"మరి సంవత్సర చందా?" అని అడగబోయి భయపడి వూరుకున్నాడు సుబ్బరాజు.

ఇంటికొచ్చి భార్యకు చెప్తే ఉత్సాహపడింది."పత్రిక కొందామండీ" అంది. ఇప్పుడంత శక్తిలేదన్నాడు సుబ్బరాజు. 'పోనీ ఆ పత్రిక ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో ఇస్తాడేమో కనుక్కోండి ఆ షాపువాడిని' అంది. చాల్లేల్లే వూరుకో అని కసిరాడు సుబ్బరాజు.

తరువాత వారమే ఉచిత బహుమతుల స్కీమ్ ఇబ్బందిగా వుందని పాఠకులు, ఏజెంట్లు అసంఖ్యాంగా ఉత్తరాలు రాయడంతో స్కీము ప్రస్తుతానికి ఆపి వేయడం జరిగిందని సంపాదకీయంలో సెలవిచ్చారు. ఏజెంట్లు 'హమ్మయ్య' అని ఊపిరి పీల్చుకున్నారు.

ఒక రోజు సుబ్బరాజు ఆఫీసు నుంచి ఇంటికి వస్తూ పత్రిక కొని తెచ్చి బల్ల మీద పడేసి బాత్‌రూమ్‌లోకి వెళ్ళాడు. మొహం కడుగుతుంటే సబ్బు జారి నేల మీద పడి 'ధాం' అని శబ్దమైంది.


ఒక్క గెంతులో బయటపడి భార్యను కేకేశాడు. "శివకాశీ వాళ్ళు సబ్బులు కూడా తయారుచేస్తున్నారటే? కొనే ముందు నాకు చెప్పేదవొద్దూ?" అని.

నాలుగేళ్ళ బుజ్జిగాడు పెరట్లోకి వచ్చి 'వావ్హోయ్! అమ్మ కింద పడింది... ఇంకా లేవలా" అన్నాడు ఉత్సాహంగా చప్పట్లు చరుస్తూ. అప్పుడు గ్రహించాడు సుబ్బరాజు ఆ శబ్దం శివకాశీ సబ్బువల్ల వచ్చింది కాదనీ లోపల భార్య కిందపడ్డ తాలూకుదనీ-

అలా సబ్బు మొహం వేసుకునే లోపలికి పరుగెత్తాడు. భార్య కిందపడి వుంది గానీ మొహం వెలిగిపోతోంది. చేతిలో పత్రిక వుంది.

"ఏమిటే ఏమయింది?" అడిగాడు.

"ఇంతకాలం లక్షలాది పాఠకుల్ని వెర్రెత్తిస్తున్న సీరియల్ పేరు ఆదిమానవులుటండీ! పోటీ కూడా పెట్టా



రుగా సీరియల్ పేరు కనుక్కోమనీ! ఆర్టిస్టు బొమ్మలని బట్టి నేనూ రాసి పంపా కానీ ఇంచుమించు అదే పేరు రాశా... మరి బహుమతిస్తారో ఇవ్వరో'' అంది.

''ఏం రాశావ్!'' చిరాగ్గా అడిగాడు.!

''బోడి మానవులు''

సుబ్బరాజు పళ్ళు కొరుకుతూ ''ఇంతకీ ఎవ్వరాశా డట అది?'' అన్నాడు.


''కావ్యాత్తుల సూర్యారావుగారు... అబ్బ... నా అభిమాన రచయిత'' పరవశంగా అంది.

సుబ్బరాజుకి కోపం నషాళానికంటింది ఒక్క సీరియల్ కూడా పూర్తిగా రాలేదు... అప్పుడే నీ అభిమాన రచయితైపోయాడా!'' అన్నాడు.

భార్య అతనివైపు అదోలా చూసి క్లుప్తంగా అంది.

''అతనంటే మీకు కుళ్ళులేండి...''

సుబ్బరాజు కోపం దిగమింగుకుంటూ కళ్ళెర్రజేయ బోయాడు. సబ్బు నురగ కంట్లో పడి కళ్ళు మండాయి. మళ్ళీ పంపు దగ్గరకి వెళ్ళి మొహం కడుక్కుని కాఫీ తాగుతూ పత్రిక తిరగేశాడు.




ఇంతకాలం సీరియల్ పేరు కోసం, రచయిత పేరు కోసం ఎదురు చూసిన పాఠకులకు ఈ వారంతో సస్పెన్స్ విడిపోయింది. ఈ సీరియల్ కోసం శ్రీకావ్యాత్తుల సూర్యారావుగారు చాలా వ్యయ ప్రయాసల కోర్చి స్వయంగా అరణ్యాల వెంట, ద్వీపాల వెంట పడి తిరిగి సబ్జెక్టు మీద పరిశోధించి రాసి మాకు పంపుతున్నారు.

అయితే ఆయన్నుంచి గత రెండు వారాలుగా ఎటువంటి కబురూ లేదు. ఆయన సీరియల్ తాలూకు మిగతా భాగాలు పంపిన వెంటనే మళ్ళీ సీరియల్ కొన సాగుతుంది. ఈ అసౌకర్యానికి మమ్మల్ని క్షమిస్తారనే మా నమ్మకం- మీ సం.

వారం తర్వాత అన్ని పత్రికలలోనూ కావ్యాత్తుల సూర్యారావుగారి ఫొటో పడింది.

కనపడుటలేదు.

''ఏమండీ! చంటాడూ చంటిదీ మీ కోసం బెంగెట్టుకున్నారు. సీరియల్ రాయకపోతే పీడా బాయిరి. మీరెక్కడున్నా వెంటనే ఇంటికి రావలసింది.

— కన్నీళ్ళతో మీ భార్య...

అది చూసి సుబ్బరాజు నిజంగానే బాధపడ్డాడు. సాహిత్యంలో పోటీని తట్టుకోవడానికి రచయితలు పాపం ఎన్ని పాట్లు పడుతున్నారు! అనుకున్నాడు.

ఎడిటరు చాలా హాట్‌గా వున్నాడు. దిక్కుమాలిన సీరియల్ అసలు మొదలెట్టక పోయినా బాగుండేది. పసీపాటా లేని సన్నాసి పాఠకులందరూ ఫోన్లు చేస్తు న్నారు. అక్కడికీ పాఠకులని సర్దే ప్రయత్నంలో, ఓ చిన్న పిల్ల పంపినట్లు ఓ టెలిగ్రాం కూడా ప్రచురించాడు.

''క్రావ్యాత్రి మామయ్యా! సీరియల్ కోసం బడి కూడా మానేసి ఎదురుచూస్తున్నాను - వెంటనే రాయ వలసింది. బి.ప్రవీణ — నాలుగో క్లాసు — అని.

అసిస్టెంట్ ఎడిటర్ బోడి సలహా విని స్టాఫందరికీ తలో స్లోగన్ బోర్డూ ఇచ్చి 'సీరియల్ మళ్ళీ ప్రచురించాలి. సస్పెన్సులో ఆపితే మేం చచ్చిపోతాం'

'మేం బతుకుతున్నదే ఈ సీరియల్ చదవడం కోసం. మధ్యలో ఆపేస్తే మా గతేం కాను?'' ఇలా పత్రికాఫీసు ముందర బైఠాయింపు చేయించి ఎడిటర్‌ని ఘెరావో చేసినట్టు ఫోటోలు కూడా వేయించాడు. ఆమరణ నిరాహార దీక్షలో కూర్చున్న ఓ (కా)లేజీ కుర్రాడిని ఎడిటర్ స్వయంగా నిమ్మకాయ రసం ఇచ్చి దీక్ష విరమింపచేసి సీరియల్ పునః ప్రారంభిస్తామని వాగ్దానం కూడా చేసినట్టు ప్రకటించారు. ఎంత చేసినా అసలు సీరియల్ మధ్యలో ఆగిపోతే ఎంత అవమానం! రచయిత ఈ 'థీమ్' సగం దాకా చెప్పి డబ్బు లివ్వండని తీసుకుని నాలుగు గోచీలు, రాతితో చేసిన పనిముట్లు ఒక బల్లెం కొనుక్కుని స్వయంగా పోయాడు. ఎందు కొచ్చిన రిస్కయ్యా హాయిగా ఏ హోటల్ రూమ్‌లోనో కూర్చుని రాయనయ్యా అంటే వినలా. ఇప్పుడెక్క డున్నాడో, అసలున్నాడో లేడో, ఏ మృగమైనా మింగే సిందో —

ఇంతలో సెక్రెటరీ వచ్చి బిరడా బిగించి వున్న ఓ ఖాళీ సీసా టేబిల్ మీద పెట్టాడు. లోపల కాగితం చుట్టలు కనిపిస్తున్నాయి.

''ఏమిటిది?'' అడిగాడు ఎడిటర్.

''పోస్టుమాన్ పట్టుకొచ్చి ఇచ్చాడు సార్. పోస్టల్ డిపార్ట్‌మెంట్ వాళ్ళకి ఈ సీసా సముద్రపు ఒడ్డున దొరికిందట. లోపల సీరియల్ తాలూకు ఒక ఇష్యూకి సరిపడా మేటర్ వుంది. అడ్రస్ చేసి మనకి డెలివరీ ఇచ్చాడు'' చెప్పాడు సెక్రటరీ.

ఎడిటర్ సీసా బిరడా లాగి లోపల కాగితాలు చూశాడు. రచయిత రాసిన లెటరు కూడా వుంది.

''ఎడిటర్ జీ! సబ్జెక్ట్ మీద పరిశోధన చేస్తూ జంబ్లాక్వే ద్వీపం చేరుకున్నాను, ఇక్కడ కరెంటు కానీ పోస్టల్ సౌకర్యం కానీ ఏమీ లేదు. ఈ ద్వీపవాసులకు నిప్పు రాజేయడం ఈ మధ్యే నేర్పించాను. సీరియల్ తరువాయి భాగం సీసాలో పెట్టి సముద్రంలో వదులు తున్నాను. ఇది ప్రచురించండి. త్వరలో మరికొంత పంపుతాను. నా సీరియల్‌కి బాగా రెస్పాన్స్ వస్తోందను కుంటాను. అన్నట్లు పాఠకులతో నా ముఖాముఖీ ఎప్పుడు ఏర్పాటు చేస్తున్నారు.

మీ — క్రావ్యాత్రి

ఎడిటర్ వెంటనే సీరియల్ మాటర్ ప్రింటింగ్‌కి పంపించాడు. తరువాతి వారంలో అది వచ్చింది. మళ్ళీ నాలుగు వారాల దాకా సీరియల్ పత్తా లేదు.

ఎడిటర్‌తో సహా అరడజను మంది సబ్ ఎడిటర్లు సముద్రపు ఒడ్డునే మైలుకొక్కళ్ళు చొప్పున గుడారా లేసుకుని దీక్షగా సముద్రం వైపే చూస్తూ కూర్చు న్నారు. అయినా సీసా కాదు కదా గాజు పెంకు కూడా కనిపించలా —

ఇంతలో పోస్టల్ డిపార్ట్‌మెంట్ వాళ్ళు వారోత్సవాలు ప్రకటించారు. ఆ వారం కర్టెసీ వీక్‌ట.

'ప్రజా సేవయే మా కర్తవ్యం. అణకువ, మర్యాద, వినయం ఒందనం ఈ వారం పొడుగునా (మాత్రమే) మీరు గమనిస్తారు. ఎంత కఠినమైన ఎ ్రసుకైనా సరే మీ జాబులు నిర్ణీత కాలంలో చేరతాయి. ఇంకా ఆలస్యం ఎందుకు? ఈ రోజే జాబులు వ్రాసి పోస్టు చేయండి. మా కర్తవ్య సేవా పరాయణత్వం మీకే తెలుస్తుంది' అని.

ఎడిటర్ ఇక ఒక్క క్షణం కూడా ఆలస్యం చెయ్య లేదు. ఒక సుదీర్ఘమైన తిట్టు లేఖ ' నీ పిండాకూడు రీసెర్చి', 'వెంటనే ఇక్కడికి తగలడతావా లేదా!', 'నీ బోడి సీరియల్ వేసుకోవడమే కాక ముఖాముఖీ కూడాకావాల్నా నీ మొహానికి' ఇత్యాది పరుష పదజాలం ఉపయోగించి రాసి, కవరుపైన శ్రీ క్రావ్యాత్తుల సూర్యారావు, జింబ్లాక్వే ద్వీపం ... అని మాత్రం రాసి పోస్టు చేయించాడు. ఈ దెబ్బతో పోస్టల్ డిపార్ట్‌మెంట్ వాళ్ళ తిక్కకుదురుతుంది అనుకున్నాడు కసిగా.


* * *

పోస్టు మాస్టర్ జనరల్ తలపట్టుకు కూర్చున్నాడు. అన్ని ఉత్తరాలూ చకచకా రవాణా అయిపోతున్నాయి కానీ ఇదిగో ఈ జింబ్లాక్వే ఉత్తరం మాత్రం ఆయన టేబిల్ మీద మొన్నట్నించీ వుండిపోయింది. ఇప్పుడా ఉత్తరాన్ని బట్వాడా చేయకపోతే ఎంత నామర్దా?

అప్పటికి ఇరవైయ్యోసారి వరల్డ్ మ్యాపు చూడడం. ఎక్కడా కనిపించలా జింబ్లాక్వే ... ఇలా ద్వీపం దొరక లేదూ అని ఫ్రమ్ అడ్రస్‌కి తిప్పి పంపితే? అసలే వాళ్ళు పత్రికలవాళ్ళు. పగలబడి నవ్వి అవాకులూ చవాకులూ రాయరూ పోస్టల్ డిపార్ట్‌మెంట్ మీద?

ఇక లాభం లేదని అంజనం వేసేవాణ్ణి పిలుచు కొచ్చారు. వాడు అంజనం వేసి ద్వీపం కనిపిస్తోంది గానీ అక్కడికి వెళ్ళే దారి కనిపించడం లేదని చెప్పి ఫీజు కింద పాతిక కవర్లూ, 50 కార్డులూ తీసుకెళ్ళిపోయాడు.

ఇంకే దారీ లేక నిస్పృహగా ఇంటికెళ్ళాడాయన. ఏమిటలా వున్నారని భార్య అడిగితే చెప్పాడు. ఆవిడ కూడా తలగోక్కుని కొడుకు స్కూలు బ్యాగుతీసి దేశపటం చూసింది ఏ మ్యాపులో ఏ ద్వీపం వుందోనని. ఆ రోజే వూరి నుంచొచ్చిన ఆమె అత్తగారు సంగ తేమిటని అడిగి తెల్సుకుని భళ్ళున నవ్వింది. ఓసి పిచ్చి కన్నా ... మా దత్తుడి మేనమామ మరదలి ఆడబిడ్డని ఆ




వూరేగా ఇచ్చారూ? అంది. ఆ మాట విని దిగ్గున లేచి పరుగెత్తుకొచ్చాడు పోస్టు మాస్టర్ జనరల్. "నిజమా! నువ్వు చెప్పేది నిజమా అమ్మా!" అన్నాడు ఉద్వేగంతో ... "అవున్నా కోనసీమలో కమలాపురం వెళ్ళి అక్కణ్ణించి బస్సులో ప్రయాణించి గోదావర్లో పడవుంటే, పడవ లేకపోతే ఈదుకుంటూ వెళితే జిం బ్లాక్వే గ్రామం వస్తుంది" అని చెప్పింది. వెంటనే ఆయన హుటాహుటీన వెళ్ళి ఇన్ఫర్మేషన్ డిపార్టుమెంట్ వాళ్ళకి ఫోన్ చేశాడు. వాళ్ళా అరగంట వెతికి 'నిజమే ... ఆ ద్వీపం వుంది అని నిర్ధారించారు. కానీ ఆ వూరికి ఎలాంటి సౌకర్యం లేదట. అసలక్కడ మనుష్యులున్నారో లేదో కూడా అనుమానమే అని చెప్పారు. ఆ మాత్రం ఇన్ఫర్మేషన్ చాలు ఆయనకి. తన క్రింది ఉద్యోగులను పిలిచి ఎలా అయినా సరే మెరికలాంటి పోస్టుమాన్‌ని స్పెషల్‌గా డెప్యూట్ చేసి ఆ ఉత్తరం డెలివరీ అయేలాగా చూడాలని గట్టిగా చెప్పాడు.

మర్నాటికి సుబ్బరాజుకి పిలుపొచ్చింది. పోస్టుమాస్టర్ అతని భుజం తట్టి, నువ్వు ఆంజనేయులులాంటి వాడివి. నీ శక్తి నీకు తెలీదు. ఎలాగైనా సరే ఈ ఉత్తరం అక్కడికి చేర్చాలని అధికారయుక్తంగా చెప్పి సుబ్బరాజుకి ఆ ఉత్తరం ఇచ్చి చేతులు దులుపుకున్నాడు.

మొగుడు తన అభిమాన రచయితను కలుసుకోవ డానికి వెడుతున్నాడనే సరికి సుబ్బరాజు భార్య [illegible]ట్ మెంట్‌తో అతన్ని కావలించుకుని కుదిపేసిం[illegible]. అతనికి వీర తిలకం దిద్దీ పంపించింది.

బస్సు వెళ్ళగలిగినంత దూరం వెళ్ళి సుబ్బరాజుని దింపేసి వెనక్కొచ్చేసింది.

ఎదురుగా అనంత గోదారి. సుబ్బరాజు ఒక్క క్షణం భయపడ్డాడు. కానీ వెంటనే కర్తవ్యం గుర్తుకొచ్చింది. ఉత్తరాన్ని సెల్‌ఫిన్ పేపర్లో చుట్టి బొడ్లో దోపుకున్నాడు. చకచకా ఈత దుస్తులు ధరించాడు. అక్కడ పడవలు నడపడం మానేసి రెండు ప్రణాళికలపైనే అయిందట. భగవంతుడికి నమస్కారం చేసి గోదార్లో దూకేశాడు. ఈదగలిగినంత ఈది కాస్సేపు ప్రవాహానికి కొట్టుకు పో[illegible] సముద్రంలో కూడా కొంత దూరం పోయి మర్నాటి నేల తగిలితే కళ్ళు తెరిచి చూశాడు.

సుబ్[illegible]జు మొహంలో మొహం పెట్టి ఓ ఆదిమానవుడు [illegible] చూస్తున్నాడు. సుబ్బరాజు నీరసంగా "జింబ్లాక్వే?" అని సౌంజ్ఞలతో అడిగాడు.

ఆదిమానవుడు తలూపాడు.

సుబ్బరాజు దిగ్గునలేచి ప్రొఫెషనల్ వాయిస్‌లో 'పోస్ట్' అని అరిచాడు.

ఆ ఆదిమానవుడు ఖంగారుగా అటూ ఇటూ చూసి 'ష్' అంటూ సుబ్బరాజు నోరు అరచేత్తో నొక్కాడు. సుబ్బరాజు ఏమిటిది అంటూ గింజుకున్నాడు.

'గట్టిగా అరవకయ్యా నీ కేక ఆదిమానవులు గానీ విన్నారంటే వచ్చిపడి నిన్ను పచ్చిగానే పీక్కుతినేస్తారు" అన్నాడతను.

సుబ్బరాజు భయంతో గొంతు తగ్గించి ... "మీరు ఆదిమానవుడు గారు కాదా!' అని అడిగాడు. "కాదు. నా పేరు కొవ్వొత్తుల సూర్యారావు ..." అన్నాడతను. మళ్ళీ అప్రయత్నంగా 'పోస్ట్' అని అరి చాడు సుబ్బరాజు. సూర్యారావు అతన్ని చెయ్యిపట్టుకుని పరుగు పరుగున లాక్కెళ్ళి ఓ కొండ గుహలో కూలే శాడు.

"అడివి కోడిని ఫ్రై చేసి పెట్టాను. ముందర తిను" అన్నాడు సూర్యారావు.

సుబ్బరాజు నిర్మొహమాటంగా "నేను ఉత్తరాలిచ్చే వాడినేనండి ... మనీ ఆర్డర్లు ఇచ్చే వాళ్ళయితే మీరిచ్చే దానికి ఆశపడతారేమో కానీ నేనలాంటి వాడ్ని కాదు" అన్నాడు.

"నీ నిజాయతీ కూలా' అని అనుకుని సుబ్బరాజిచ్చిన ఉత్తరం చింపి చదివాడు సూర్యారావు. తరువాత దీర్ఘంగా నిట్టూర్చి 'సీరియల్ సాంతం అవకుండానే వెనక్కి రమ్మంటాడేమిటి ఎడిటరు గారు! ఏమిటో — ప్రోత్సహించేదీ వాళ్ళే నిరుత్సాహపరిచేదీ వాళ్ళే! అని గొణుక్కున్నాడు.

సుబ్బరాజు భార్య చెప్పమన్న మాటలు జ్ఞాపకం తెచ్చుకుని "సార్! మీ సీరియల్ అత్యద్భుతం, మీ (మా) పత్రికకే హైలైట్. మీ తరువాత రచనలేమిటి? తెలుపగలరు — ఇట్లు నేనూ, మా మిత్ర బృందం" అన్నాడు.

"తరువాతి రచనలా! నా బొంద ఇక్కడున్న వాళ్ళు నరమాంస భక్షకులు. ఇక్కణ్ణించి బయటపడితే అదే పదివేలు...! అన్నాడు.

'నరమాంస భక్షకులా! మరి మీరు ఇక్కడి ఆది మానవులతో స్నేహంగా వున్నారని విన్నాను? మిమ్మల్ని భక్షించలేదేం వాళ్ళా?' అడిగాడు నిర్ఘాంతపోయి. సూర్యారావు అదో రకంగా నవ్వాడు. 'నేను మనిషిలా కనిపించలేదనుకుంటా వాళ్ళకి ... పాపం వీళ్ళు మంచాళ్ళే — అయితే నరమాంసం తింటారు అంతే. మనం ఈ రోజే ఎలాగైనా బయల్దేరి వెళ్ళిపోవాలి. నా ఈత దుస్తులు అడవి కాకి ఎత్తుకుపోయింది మరెలా?" అన్నాడు సూర్యారావు.

"నా దుస్తులు తీసుకోండి సార్!' అన్నాడు సుబ్బ రాజు నిబ్బరంగా.

సూర్యారావు ఆశ్చర్యంగా 'మరి నువ్వు?' అడిగాడు.

సుబ్బరాజు కృతనిశ్చయంతో 'నేనిక్కడే వుండి పోతాను' అన్నాడు.


'అదేమిటి?' అన్నాడు సుబ్బరాజు. "పోస్టల్ డిపార్ట్ మెంట్‌లో ఉద్యోగం చేసుకుంటూ బతికేకన్న ఇక్కడే సుఖంగా వుండొచ్చు సార్. అదీగాక కుప్పలు తిప్పలుగా సన్నాసి సాహిత్యంతో నిండిన పత్రికలు (కొన్ని) చదవడం కన్నా ఒక్క పేపరు ముక్క కూడా దొరకని ఈ ద్వీపంలో కందమూలాలు తింటూ ప్రకృతిని చదువుతూ బతికేయొచ్చు. మీరెళ్ళండి సార్' అని గిరుక్కున వెనక్కి తిరిగి విచిత్రంగా అరుస్తూ చెట్ల చాటుకి పరుగెత్తి అదృశ్యమైయ్యాడు.

సూర్యారావు దిగ్భ్రాంతి నుంచి తేరుకుని సుబ్బరాజు వదిలిన ఈత దుస్తులు వేసుకుని సముద్రంలో దూకే శాడు పాఠకులతో ముఖాముఖీ గురించి ఆలోచిస్తూ —

## అరసున్నా హాస్యాలు

శ్రీ కట్టమంచి రామలింగారెడ్డి విద్యాశాఖ అధికారిగా వున్నప్పుడు ఒక స్కూలు కెళ్లాడట. ఆ స్కూల్లో ఉపాధ్యాయుడు 'చీకటి' అనే పదం బోర్డుపై వ్రాయమని విద్యార్థిని ఆదేశించి, వ్రాసిన తర్వాత అందులో అరసున్నా లేనందున చివాట్లు వేయసాగాడట. ప్రక్కనే వున్న కట్టమంచి అందుకొని, "ఆ... చీకట్లో అరసున్నా పెడితే మాత్రం కనిపిస్తుందా ఏమిటిలెండి" అని సర్ది చెప్పాడట.

అలాగే, తిరుపతి వెంకటకవులకు, వెంకట రామకృష్ణ కవులకు సాహిత్య పోరాటం జరిగేటప్పుడు తిరపతి కవులు 'ఎందాక, ఇందాక' వంటి పదాలను




అరసున్నాలు లేకుండా ప్రయోగించారట.

దాన్ని వెంకటరామకృష్ణ కవులు ఆక్షేపిస్తూ "అయ్యా! మీ దాకలో ఒక్క అరసున్నాను వేయించండి మహాప్రభో!" అన్నారట.

28-4-89 ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక